
వివేకానంద నగర్ కాలనీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నల్గొండ వీ.టి. కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

గంగమ్మ ఒడికి గౌరమ్మ

జిల్లాలోని వివిధ గ్రామాలలో గురువారం మహిళలు సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఎత్తుకొని మహిళలు గ్రామ శివార్లలో ఉన్న చెరువులు, కుంటల వద్దకు పాటలు పాడుకుంటూ వెళ్లారు. అక్కడ బతుకమ్మల చుట్టూ కోలాటాలు వేసుకుంటూ సందడి చేశారు. అనంతరం చెరువు, కుంటల నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో బతుకమ్మ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.
- న్యూస్‌టుడే యంత్రాంగం



నల్గొండలో మహిళలు


మిర్యాలగూడలో కోలాటమాడుతున్న అమ్మవారి రూపంలో బతుకమ్మ


నకిరేకల్‌లో..


నల్గొండ: రాకిహిల్స్ కాలనీలో..


నల్గొండ బతుకమ్మలతో చిన్నారులు


నల్గొండ వీ.టి. కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చెరువులను చుట్టేస్తున్నారు..!

పరిశీలన


తుల్చమ్మకుంట ఎఫ్‌టీఎల్ ఆవరణలో నిర్మాణాల జోరు

దేవరకొండ పట్టణ పరిధిలోని చెరువులు, కుంటలు, కాల్వలు కనుమరుగవుతున్నాయి. అక్రమార్కులతో శిఖం భూములు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ నిబంధనలు తుంగలో తొక్కి కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నా.. పాలకులు, అధికారుల్లో చలనం లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. - దేవరకొండ, న్యూస్‌టుడే:

ఎక్కడంటే..

- పట్టణ పరిధిలో కొండభీమనపల్లి చెరువు ఫీడర్ ఛానెల్ దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉంది. ఐదువేల ఎకరాల ఆయకట్టును రైతులు సాగుచేసుకుంటున్నారు. దేవరకొండ పట్టణం వరకు విస్తరించి ఉన్న దీని కాల్వ ప్రస్తుతం ఎకరంన్నరనే ఆనవాళ్లు కన్పించగా, మిగతా వాటిలో భవన నిర్మాణాలు చేపట్టారు.
- కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై తుల్చమ్మకుంట చెరువు రెండు పడక గదుల ఇళ్లు, వేద సముద్రం వరకు ఏడు కిలోమీటర్లు విస్తరించి ఉంది. ప్రస్తుతం వీటిల్లో వెంచర్లు, అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు తాము అనుమతి ఇవ్వలేదని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.
- గతేడాది పట్టణం మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తుల్చమ్మకుంట చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ హద్దులను పుర, నీటి పారుదలశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధుల అండతోనే కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా నీటిపారుదలశాఖ అధికారులు దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదులూ చేశారు.

నిబంధనలు బేఖాతరు..


ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన ఎఫ్‌టీఎల్ హద్దు

- తుల్చమ్మకుంట పరిధిలో వెంచర్ వేయాలంటే ముందుగా ఆ స్థిరాస్తి వ్యాపారి భూమిని సంబంధించిన వివరాలు తెలుపుతూ నీటి పారుదలశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. కానీ అలాంటి ఆనవాళ్లు లేవు.
- ఒకవేళ చెరువుల పరిధిలో ఎన్‌వోసి పొందినట్లయితే బఫర్‌జోన్లు వదిలిపెట్టాలి, అధికారులు పరిశీలనకు వస్తే అడ్డుకోకూడదు, ఏ సమయంలోనైనా వెంచర్‌కు అనుమతి రద్దు చేసేందుకు వీలుగా ఉంటూ ఎన్‌వోసి జారీ చేస్తారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

– నగేష్, నీటిపారుదలశాఖ ఏఈ, దేవరకొండ

పట్టణ పరిధిలోని తుల్చమ్మకుంట, వేదసముద్రం, కొండభీమనపల్లి చెరువుల్లో అనుమతి లేకుండా, కాల్వలు మూసివేసి నిర్మాణాలు చేపడుతుండటంతో పోలీస్‌స్టేషన్‌లో అనేక సార్లు ఫిర్యాదు చేశాం. వీటితో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

అనుమతి లేని టపాసుల దందా

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో టపాసుల అక్రమ దందా జోరుగా కొనసాగుతోంది. జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతితో టపాసుల అమ్మకాలు జరపాల్సి ఉంటుంది. కానీ ఒకరిద్దరు గుత్తేదారులు రాజకీయ నాయకుల అండదండలతో అనుమతి లేని టపాసులను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు. ఏ ఒక్క శాఖ నుంచి అనుమతి తీసుకోకుండా అక్రమ దందా కొనసాగిస్తూ రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. విజయదశమి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎన్జీకళాశాలతో పాటు నెహ్రూగంజ్, ఎల్‌పీటీ మార్కెట్, సెంటర్, హైదరాబాద్ రోడ్డు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టపాసుల సముదాయాల్లో ఒక్కరు కూడా ప్రభుత్వ శాఖల అనుమతి తీసుకోకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఎమ్మార్పీ ధరలను ఏమార్చి ఇష్టారాజ్యంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. రూ.5 వచ్చే టపాసులను రూ.25కు అమ్మకాలు చేస్తూ వినియోగదారుల నుంచి అందిన కాడికి జేబులో వేసుకుంటున్నారు.


జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో అనుమతి లేకుండా వెలసిన దుకాణాలు

అనుమతి లేదు:

– సత్యనారాయణరెడ్డి, అగ్నిమాపకశాఖ ఎస్‌హెచ్‌వో, నల్గొండ

జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన టపాసుల షాపులకు గురువారం వరకు ఎలాంటి అనుమతి లేదు. కొందరు వ్యాపారులకు తీసుకోవాలని చెప్పడంతో వారు శుక్రవారం దరఖాస్తులు చేసుకుంటామని చెప్పారు. అధిక ధరలు అమ్మేవారి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాకిహిల్స్ కాలనీ అమ్మ వారి వద్ద నల్గొండ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.
– ఈనాడు, నల్గొండ

యాదాద్రీశుడి క్షేత్రంలో దైవారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో గురువారం ప్రధానాలయంలో నిత్యపూజలు కొనసాగాయి. పంచనారసింహులను ఆరాధిస్తూ పూజలు పాంచరాత్రాగమ శాస్త్ర రీత్యా చేపట్టారు. సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ మహా ద్వారాలను తెరిచి మూలవరులకు హారతి నివేదన చేపట్టి, నిత్య ఆరాధనలకు శ్రీకారం చుట్టారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన పర్వాన్ని కొనసాగించారు. ఉగ్ర నరహరిని కొలుస్తూ శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణమూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య వేద మంత్రాలతో నిర్వహించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్య ఆదాయం వెల్లడించారు. గురువారం వివిధ విభాగాల ద్వారా రూ.13,40,391 ఆదాయం చేకూరింది.

పరిశ్రమలొస్తున్నాయ్..!

ఉమ్మడి జిల్లాలో విస్తరణ కోసం సర్కారుకు పలు కంపెనీల దరఖాస్తు

టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో భూ సేకరణ పూర్తి

తలసరి ఆదాయానికి సూచికలుగా భావించే పారిశ్రామికీకరణలో భాగంగా.. ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నాయి. సున్నపురాయి నిక్షేపాలున్న కృష్ణపట్టి ప్రాంతంలో సిమెంటు పరిశ్రమలు విస్తరణకు ప్రభుత్వానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా.. రహదారి, రైలు, విమాన మార్గాలు అందుబాటులో ఉన్న రాజధాని సమీప ప్రాంతాల్లో ఫార్మా, పైపులు, ఇతర ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించడానికి వ్యాపారవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. - ఈనాడు, నల్గొండ

★ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం సమీపంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా హరిత పారిశ్రామిక పార్కులో ఇప్పటికే 300లకు పైగా పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి. త్వరలోనే మరిన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వాటిలో పాలకవీడు మండలంలోని దక్కన్ సిమెంటు పరిశ్రమ రూ.1218 కోట్లతో విస్తరించడంతో పాటూ 320 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపింది. మేళ్లచెరువు మండలంలో మైం హోం సిమెంటు పరిశ్రమ రూ.1500 కోట్లతో విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. దీని వల్ల 500 మందికి ఉపాధి లభించనుంది.

★ మరోవైపు హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్కన నార్కట్‌పల్లి సమీపంలో రూ.301 కోట్లతో మహారాష్ట్ర కేంద్రంగా పనిచేసే సీమ్‌లెస్ లిమిటెడ్ పైపుల తయారీ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీని వల్ల 200 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. తొలి దశలో ఈ మూడు కంపెనీలు ఉమ్మడి జిల్లాలో రూ.3,019 కోట్లతో 1020 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. మలి దశలో మరిన్ని ఆహారశుద్ధి పరిశ్రమలు దామరచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లో స్థాపనకు ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పించనున్నట్లు తెలిసింది.

★ ప్రభుత్వం సదరు కంపెనీల దరఖాస్తులకు ఆమోదం తెలిపితే మెగా ప్రాజెక్టు కింద అవి వెచ్చించే పెట్టుబడిలో 30 శాతం రాయితీ లభించనుంది. భూ కేటాయింపుల్లో రాయితీతో పాటూ స్టాంప్, ట్రాన్స్‌ఫర్, రిజిస్ట్రేషన్ ఫీజులకు మినహాయింపు ఉంటుంది. వీటితో పాటూ విద్యుత్ సబ్సిడీ, వడ్డీ రాయితీలు సైతం షరతులతో వర్తిస్తాయి.

పారిశ్రామిక పార్కుల సంగతో..?

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, చిట్యాలలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) భూములను సేకరించింది. సూర్యాపేట, మిర్యాలగూడల్లో ఆటోనగర్ పేరిట భూములను సైతం సేకరించారు. మిర్యాలగూడ గ్రామీణ, దామరచర్ల మండలాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలకు సైతం భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు వాటిల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కేందుకు ఆస్కారం ఉంటుంది.

★ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్న కంపెనీలతో పాటూ ప్రభుత్వ హయాంలో కంపెనీలు నెలకొల్పడానికి కేటాయింపులు చేసిన భూముల్లో కంపెనీలు నెలకొల్పి ఉత్పత్తులు ప్రారంభిస్తే యువతతో పాటూ స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయి. దీనిపైనా మూడు జిల్లాల అధికార యంత్రాంగాలు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

ఆహార భద్రత.. 2028



మిర్యాలగూడ పట్టణం, భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కరోనాతో కుదేలైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ వస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఉచిత బియ్యం పంపిణీ గడువు ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుండడంతో మరోసారి భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ..

ఆహార భద్రత కార్డుదారులకు గత కొంత కాలంగా కేంద్రం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి:

వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్గొండ

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 2028 డిసెంబరు వరకు రేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నాం. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో 10,07,039 కార్డుదారులకు లబ్ధి..

కేంద్రం నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 10,07,039 కార్డుల్లోని 29,83,445 మంది యూనిట్లకు నాలుగేళ్ల పాటు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 63,795 అంత్యోదయ కార్డులు ఉండగా.. ఒక్కో కార్డుకు 35 కిలోల చొప్పున, 9,43,145 ఆహార భద్రత కార్డులు ఉండగా.. ఇందులోని యూనిట్‌కు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. అక్టోబరులో అంత్యోదయ కార్డులకు 22,32,825 కిలోలు, ఆహార భద్రత కార్డులకు 1,68,41,556 కిలోల బియ్యం పంపిణీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రేషన్ కార్డులు, అక్టోబరులో కేటాయించిన బియ్యం వివరాలు..

జిల్లా	మొత్తం కార్డులు	యూనిట్లు	బియ్యం (మె.టన్నుల్లో)
నల్గొండ	4,66,015	13,92,156	8,914.099
సూర్యాపేట	3,24,184	9,31,351	5,945.164
యాదాద్రి	2,16,840	6,59,938	4,216.108

బదిలీలు ఉన్నట్టా..లేనట్టా..!

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో సందిగ్ధత నెలకొంది. బదిలీ ఉత్తర్వుల సోమవారం జారీ చేయాల్సి ఉండగా నిలిచిపోయింది. అసలు ఉత్తర్వులు ఇవ్వాలా వద్దా? అనేది రెండు రోజులుగా స్పష్టత కరవైంది. నల్గొండ సర్కిల్ పరిధిలోని నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో పనిచేస్తున్న 11 కేటగిరీల్లో సుమారు 350 మంది పైగా ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉంది. వీరంతా బదిలీల కోసం నిరీక్షిస్తున్నారు. తదుపరి సూచనలు వచ్చే వరకు బదిలీలు నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు నిరాశకు గురవుతున్నారు.

పదోన్నతులే అడ్డు

విద్యుత్తు సంస్థలో ఇటీవల ఏఈ నుంచి ఏడీఈ స్థాయి ఉద్యోగులకు పదోన్నతి అవకాశం కల్పించారు. వారికి ఇప్పటి వరకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఈ సమయంలో బదిలీలు చేపట్టడంపై విద్యుత్తు సంఘాల ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సమస్యను విద్యుత్తు మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకుపోవడం, మరో పక్క బదిలీల్లో పైరవీలకు పెద్ద పీట వేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో చివరి క్షణంలో బదిలీ ఉత్తర్వులు నిలిచిపోయాయి. తిరిగి ఇవి ఎప్పుడు వస్తాయో తెలియడం లేదని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

రిపోర్టు చేసిన ఉపాధ్యాయులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ- 2024లో ఎంపికైన అభ్యర్థులు గురువారం నల్గొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొంత మంది రిపోర్టు చేశారు. రిపోర్టు చేయని అభ్యర్థులు శుక్రవారం (ఈనెల 11న) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రిపోర్టు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి తెలిపారు. రిపోర్టు చేసే సమయంలో ఎల్‌బీ స్టేడియంలో తీసుకున్న అపాయింట్‌మెంట్ ఆర్డర్ జిరాక్స్ కాపీ జత చేసి సంబంధిత కౌంటర్ నందు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా కృష్ణవేణి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారిణిగా కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. యాదాద్రి జిల్లాలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొద్ది రోజులుగా చింతపల్లి సీడీపీవో సుక్కుబాయి ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు.

దారంతా పూలవనమే బతుకమ్మ.. మాతోడు నువ్వుండి పోవే బతుకమ్మ...

మోతెలో బతుకమ్మల వద్ద మహిళల సందడి





నూతనకల్ మండలకేంద్రంలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లలో తీరొక్క పూలతో...



ఆన్‌లైన్ లోకంలో.. ఆఫ్‌లైన్ కథలు



జానకీరామ్ రచించిన కథల పుస్తకం


కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ముక్కాముల జానకీరామ్ తెలుగు సాహిత్యంలో కవితలు, పాటలు, కథలు రాస్తూ అవార్డులు పొందుతున్నారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన ఆయన ఆఫ్‌లైన్, ఏడు రంగుల వాన వంటి కథల పుస్తకాలు, 100కు పైగా కథలు రాశారు. ఇప్పటికే యూట్యూబ్‌లో మూడు పాటలు విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ సారస్వత పరిషత్ వారు రచయితలకు నిర్వహించిన కథల పోటీల్లో అవార్డు సాధించారు. నేడు బాలల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లోనే గడుపుతున్నారు. ఆన్‌లైన్‌కు దూరం చేయాలనే ఉద్దేశంతో 'ఆఫ్‌లైన్' కథల పుస్తకాన్ని రచించారు. చరవాణితో కలిగే నష్టాలను ప్రస్తావిస్తూ 22 కథలు రాశారు. 27 కథలతో 'ఏడు రంగుల వాన' పుస్తకాన్ని ప్రచురించారు. మేళ్లచెరువు ఉన్నత పాఠశాలలో పనిచేసే సమయంలో విద్యార్థులతో 33 కథలు రాయించి 'ఊహలకు రెక్కలొస్తే' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది సూర్యాపేట జిల్లాలోనే మొదటి బాలల కథల పుస్తకం.

- విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, నైతిక విలువలను పెంపొందించడమే తన ఉద్దేశమని **జానకీరామ్** తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వీయరచనా సామర్థ్యాలను పెంపొందించడం, భావి రచయితలను సమాజానికి అందించడమే లక్ష్యంగా విద్యార్థులతో కథలు రాయిస్తున్నట్లు చెప్పారు.




బంధాలు గుర్తుంటే.. ప్రతిరోజూ పండగే

నాంపల్లి, న్యూస్‌టుడే:



తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండగ దసరా. . పండగ సెలవుల సందర్భంగా పట్టణాల్లో స్థిరపడిన కుటుంబాలు పల్లెబాట పడుతున్నాయి. పల్లె ప్రాంగణాల్లో కొంత సందడి నెలకొంటోంది. ఒకప్పుడు పండగ సెలవులు తాత, అమ్మమ్మ, నాయనమ్మ, మనుమలు, మనుమరాళ్ల కబుర్లతో ఎంతో సంతోషంగా గడిచేవి. అప్పటి రోజుల్లో పండగ వచ్చిందంటే పంట పొలాలు, చెరువుగట్లు, తోటల్లో చెట్ల కింద సేద తీరుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించేవారు. నిండైన వెన్నెల కాంతుల్లో ఆరుబయట పిల్లలు.. పెద్దలూ కబుర్లతో కాలక్షేపం చేసేవారు. కాల క్రమేణా పండగలు కళను కోల్పోతున్నాయి. అందరూ కలిసినా ఎవరికి వారు ఒంటరిగా ఉంటూ సెల్‌ఫోన్లు.. కంప్యూటర్లతోనే గడుపుతున్నారు. నేటి ఈ ఆధునిక జీవన తీరు చూస్తుంటే పూర్వకాలంలోని అను'బంధాలు' గుర్తుచేసుకోక తప్పదు.


పండగ అంటే అయినవారం దరూ కలుసుకోవటం.. ఆనందాలను పంచుకోవటం.. గత స్మృతులను నెమరు వేసుకోవటం.. పది కాలాలపాటు పదిలపరుచుకునే మరిన్ని అనుబంధాలను మూటకట్టుకోవటం.. పండగ పూట ఇలాంటి మధురిమలు పొందాలంటే.. బంధుమిత్రులూ.. ఆత్మీయులందరితోనూ మమేకమవ్వండి.. పాలపిట్టను చూడండి... జమ్మిపూజలో పాల్గొనండి.. జ్ఞాపకాలను మదిలో పదిలపర్చుకోండి.. ఆ అనుబంధాలతో పంచుకున్న ఆనందమే పరిపూర్ణమైన దసరా పండగ..



దినపత్రికలు, పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన..

అంతర్జాలం పుణ్యామా అని దినపత్రికలు, పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయింది. ఎంత సేపూ సెల్‌ఫోన్లు.. సామాజిక మాధ్యమాలను అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నారు. వాటివల్ల అవగాహన స్థాయి పెరగదు.. అనుభూతి కలగదు.. జ్ఞాపకశక్తి పెంపొందదు. పైగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అదే ఏదైనా ఓ మంచి పుస్తకం, దినపత్రికలు చదివితే కలిగే అనుభూతి వేరు. ఇటీవల దినపత్రికల్లోనూ చాలా మార్పులొచ్చాయి. సూటిగా, స్పష్టంగా తక్కువ వాక్యాల్లోనే కీలక విషయాలు, భావాలను చెబుతున్నాయి. వీటి వల్ల సామాజిక పోకడ అవగతమవుతుంది. వివేకం పెంపొందుతుంది. పండగ సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రాధాన్యత తగ్గించండి. . పుస్తక పఠనంపై దృష్టి మరల్చండి.

ఆచరిస్తే.. ఆనందాలే..



పల్లెలకు వస్తున్న పిల్లలూ.. పెద్దలు.. దసరా సెలవులను తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మలతో ఆనందంగా గడపండి. పచ్చని పొలాలు, పంట కాల్వలు, పూల తోటల్లో విహరించి, ప్రకృతి అందాలను ఆస్వాదించండి. పల్లె ప్రకృతిని ఆకళింపు చేసుకోండి. పుట్టిపెరిగిన ఊరిని పరికించి, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, వారిని కన్న పెద్దలనూ గుండెలకు హత్తుకోండి. ఉన్న వారం ఇంటిల్లిపాదితో సంతోషంగా గడిపి చక్కని అనుభూతి మూటకట్టుకోండి. ఇలాగైతే మునుపెన్నడూ లేని రీతిలో పండగ ఆనందాలు వెల్లివిరుస్తాయి..! ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకునే ప్రతి రోజూ పండగను తలపిస్తుంది.

బంధుమిత్రులతో కులాసా కబుర్లు..



ఈ కాలంలో అయిన వారితో కబుర్లు మాటలు, యోగక్షేమాలు, పలకరింపులు చరవాణికే పరిమితమయ్యాయి. వ్యక్తిగతంగా వారిని కలవడం, ఆనందాలను పంచుకోవడం పూర్తిగా తగ్గిపోయింది. దసరా పండగ సెలవు రోజుల్లో సాధ్యమైనంత వరకు చరవాణికి దూరంగా ఉండండి. గ్రామంలోని బంధుమిత్రులను కలవండి. ఆనందంగా వారితో గడపండి. ఆ జ్ఞాపకాలు మళ్లొచ్చే దసరా వరకు పదిలంగా ఉంచుకోండి.



విజేతలైన విద్యార్థులతో వారి తల్లిదండ్రులు

నయనానందం.. నృత్యాభినయం

కోదాడ, న్యూస్‌టుడే:



ఈ రోజుల్లో పిల్లలు పాఠశాలలకు వెళ్లి విద్య నభ్యసించాలంటేనే బద్ధకంగా ఉంటారు. కానీ కొందరు విద్యార్థులు చదువులో రాణిస్తూ ప్రపంచ రికార్డులు సాధిస్తున్నారు. ఇటీవల అంతర్జాతీయ కర్నాటిక్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, కాశీ విశ్వనాథుని దేవాలయ కమిటీ నిర్వాహకులు, తమిళనాడు ప్రభుత్వం సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డులు సాధించడం విశేషం.

15 మంది.. 12 రికార్డులు..

భరతనాట్యంలో భాగంగా రావణాసురుడు రచించిన రావణాకృత శివతాండవం స్తోత్రం అనే నృత్య పోటీలను మొదటిసారి నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఆన్‌లైన్ విధానంలో 8 నిమిషాల పాటు నృత్యం చేయాల్సి ఉంటుంది. సుమారు 10 వేల మంది పాల్గొన్నారు. కోదాడకు చెందిన నాట్య గురువు తిరుపతి స్వామి శిష్య బృందం నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారు. వీరందరూ నృత్యంలో ప్రతిభ కనబరచడంతో కాశీ విశ్వనాథుడి దేవాలయం, తమిళనాడు ప్రభుత్వం నుంచి అవార్డులు రావడంతో పాటు 12 ప్రపంచ రికార్డులు సాధించారు.

రెండు నెలలు కష్టపడ్డాం: పోతుగంటి తపస్య

పోటీల కోసం రెండు నెలల పాటు కష్టపడ్డాం. నిత్యం సాధన చేసి విజయం సాధించాం. ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేసిన తర్వాత కూడా నమ్మకం లేదు. పోటీల అనంతరం అవార్డులు రావడంతో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

అవార్డులు రావడం ఆనందంగా ఉంది: సోమా వెంకటశ్లోక



కొన్నేళ్లుగా కోదాడ పట్టణంలో భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలు నేర్చుకుంటున్నాం. మొదటిసారి కాశీ విశ్వనాథుడి ఆలయం వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని, మెరుగైన ప్రదర్శన ఇచ్చాం. అవార్డులు సాధించడం ఆనందంగా ఉంది. దీంతో భరతనాట్యంలో మరింత ఎత్తుకు ఎదగాలని ఉంది.



రోజుకు రెండు గంటలపాటు సాధన: యర్రంశెట్టి శ్రేష్ఠ

నిత్యం పాఠశాలకు వెళ్తూనే రోజుకు రెండు గంటల పాటు భరతనాట్యం నేర్చుకుంటున్నా. ఎనిమిది నిమిషాల పాటు ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేయాలంటే మొదట్లో భయమేసింది. కానీ మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో పలు రికార్డులు రావడం ఆనందానిచ్చింది.

ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తా: అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం.. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా టీఎస్‌యూటీఎఫ్ రెండోసారి తన పేరు ప్రకటించడంతో గురువారం నల్గొండలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, మద్దతు ఇచ్చే ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ అలుగుబెల్లి నర్సిరెడ్డి సేవలకు గుర్తింపుగా మరోసారి పోటీకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయిలు, తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎండీ.నజీమొద్దీన్, విశ్రాంత ప్రొఫెసర్ అక్కెనపల్లి మీనయ్య, టీఎస్‌యూటీఎఫ్ మైనారిటీ గురుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, శశిధర్, విజయ్, డా.శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతు ప్రకటించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు, నాగమణి, రాజశేఖర్‌రెడ్డి, సైదులు, వెంకటేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, చావ రవి, జంగయ్య

మధురం.. సీతాఫలం



తుర్కపల్లి, న్యూస్‌టుడే: సీతాఫలం మార్కెట్లోకి వచ్చేసింది. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు వరకు ఇవి సమృద్ధిగా లభిస్తాయి. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభిస్తాయి. ప్రతిఏటా ఈ పండ్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో తోటలు పెట్టి కూడా పండిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సీతాఫలాలకు ప్రసిద్ధి. ప్రధానంగా తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, భువనగిరి, బీబీనగర్, ఆత్మకూరు, యాదగిరగుట్ట, వలిగొండ ప్రాంతాల నుంచి సీతాఫలాలు పట్టణాలకు ఎగుమతి అవుతుంటాయి.

★ వర్షాకాలంలో రైతులు సీతాఫలాల విక్రయంతో ఉపాధి పొందుతూ ఉంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పక్షం రోజుల నుంచి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. గంప సైజుని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. యాదాద్రి జిల్లాతో పాటు సరిహద్దు ప్రాంతమైన సిద్దిపేట జిల్లా గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్ ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పండ్లను కొనుగోలు చేసి వాహనాలలో తుర్కపల్లి మండలం మీదుగా జిల్లా కేంద్రంతో పాటు ఇతర ముఖ్య పట్టణాలకు తరలిస్తున్నారు.

అంతరిస్తున్న వృక్షాలు... రియల్ వ్యాపారం కారణంగా సీతాఫలం వృక్షాలు తగ్గిపోతున్నాయి. దిగుబడి కూడా ఏటా తగ్గిపోతోంది. పండ్లను అధిక ధరలు పెట్టి కొనుకోవాల్సి వస్తోంది.ఏటా సీతాఫలాల మాధుర్యాన్ని ఆస్వాదించే వారికి వృక్షాలు కనుమరుగవుతుండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకప్పుడు గుట్టల్లో, చెలకల్లో ఎక్కడ పడితే అక్కడ సీతాఫలం వృక్షాలు కనిపించేవి. దారిన వెళుతుంటే ఎంతో సువాసనవచ్చేవి. ఇప్పుడు దారుల వెంట వృక్షాలు కనిపించడం లేదు. భావి తరాల కోసం వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ధైర్యలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన గురువారం శ్రీపద్మావతి అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. సహస్రదీపాలంకార సేవలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

దేవీ నవరాత్రోత్సవాల్లో అలంకార సంబరం




యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని అనుబంధ శివాలయంలో కొనసాగుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకరణ జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకార సంబురాలతో పాటు, లలితా సహస్రనామార్చన జరిపారు.

ఒక రోజు కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి చేసి రైతుబంధు నిధులు కాజేసిన కేసులో అరెస్టయిన అప్పటి హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీని విచారించేందుకు పోలీసులు ఐదు రోజుల కస్టడీ కోరగా.. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ ఒకరోజు కస్టడీకి అనుమతించారు. తాము అరెస్ట్ చేసిన సమయంలో జయశ్రీ పూర్తిగా సహకరించనందున అన్ని వాస్తవాలు తెలుసుకునేందుకు ఐదు రోజులు కస్టడీకి అనుమతించాలని కోరుతూ హుజూర్‌నగర్ పోలీసులు గురువారం పిటిషన్ వేశారు. అదే విధంగా జయశ్రీకి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ వేశారు. న్యాయమూర్తి మొదట పోలీస్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు విన్నారు. అనంతరం ఐదు రోజుల కస్టడీ కాకుండా ఒక రోజు కస్టడీకి అనుమతిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విచారణకు అనుమతించారు. పోలీస్ కస్టడీకి అనుమతించినందున బెయిల్ పిటిషన్ వాయిదా వేశారు. కోర్టుకు రెండు రోజులు సెలవులు ఉండటం వల్ల బెయిల్ పిటిషన్‌పై వాదనలు సోమవారం జరిగే అవకాశం ఉంది.

సీపీఎం నేత సీతారాములుకు మాతృవియోగం



సీతారాములు తల్లి లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, న్యూస్‌టుడే: సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ(96) వృద్ధాప్యంతో గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో మరణించారు. లక్ష్మమ్మ అంత్యక్రియలు నల్గొండ జిల్లా చిట్యాలలో నిర్వహించారు. లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన తన చిరకాల మిత్రుడు, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని చూడగానే సీతారాములు భావోద్వేగానికి లోనై ఏడ్చారు. లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సుఖేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వ్యకాసం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నల్గొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ అక్బర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు.

వ్యర్థాలలో.. అర్థం వెతికి..!

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మనం సౌకర్యం కోసం ప్లాస్టిక్ చేతిసంచులు వాడి అవసరం తీరగానే అవతల పారేస్తాం. నీళ్ల సీసా కొనుక్కుని తాగి అవతలికి విసిరేస్తాం. దుకాణం నుంచి పాలు, నూనె ప్యాకెట్లు తెచ్చి ఖాళీ కాగానే చెత్త కుండీలో వేసేస్తాం. ఇళ్లలో వాడేందుకు ప్లాస్టిక్ బకెట్లు, కుర్చీలు కొంటాం. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఏమవుతున్నాయి? వందల ఏళ్లయినా పాడైపోవు, కుళ్లిపోవు, మట్టిలో కరిగిపోవు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతోనే వ్యాపారం చేయవచ్చునని ఆలోచించారు కొయ్యలగూడానికి చెందిన చేనేత కార్మికుడు రాపోలు సైదులు, అతని భార్య కవిత. చౌటుప్పల్‌లో వీరి కుమార్తె అనూహ్య పేరిట 'అను ప్లాస్టిక్స్' పద్నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వీరు రోజుకు వెయ్యి కిలోలు చొప్పున ఇప్పటికి 50 లక్షల 40 వేల కిలోలు సేకరించారు. వాటిని యంత్రాల్లో వేసి గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసి పునరుత్పత్తి కేంద్రాలకు తరలించారు. పర్యావరణానికి ఎంతో మేలు చేసే ఈ వ్యాపారంతో ప్రత్యక్షంగా ఎనిమిది మందికి, పరోక్షంగా 30 మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవకు గుర్తింపుగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పురపాలిక ద్వారా ప్రశంసాపత్రాన్ని అందించి సన్మానించారు.

మాకు ఉపాధి...పర్యావరణానికి మేలు

– రాపోలు సైదులు, కవిత, కొయ్యలగూడెం

మా నాన్న రాపోలు నర్సింహ దగ్గర చేనేత పని నేర్చుకున్నా. పేదరికం వల్ల పదో తరగతి పూర్తి కాగానే చదువు మాన్పించి మగ్గం నేయడానికి కుదురుకున్నా. పద్నాలుగేళ్ల పాటు మగ్గంపై నేత పని చేశాను. వస్త్రాలు అమ్ముడుపోక పని దొరకడం కష్టమైంది. అప్పటికే ముగ్గురు సంతానం. చేనేత వృత్తి పనిని వదిలేశాను. నా బావమర్ది శ్రీనివాస్ ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాపారం చేయవచ్చని ఆలోచన చెప్పాడు. రూ.ఆరు లక్షలతో ప్లాస్టిక్ గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసే యంత్రాలు కొనుగోలు చేసి తెచ్చాం. సుమారు 30 మంది నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి సుమారు వెయ్యి కిలోల వరకు మా దగ్గరికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. వారికి రోజూ సగటున రూ.300 ఆదాయం వస్తుంది. మా షెడ్డులో ఆరుగురిని ఉద్యోగులుగా నియమించుకున్నాం. వాళ్లతో మేము కొనుగోలు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను కవర్లు, నీళ్ల సీసాలు, మందంగా ఉండే డబ్బాలు, కుర్చీలు, టేబుళ్లు ఇలా 21 రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను రంగుల వారీగా వేరు చేయిస్తాం. నీళ్ల సీసాలను ప్రెస్సింగ్ చేస్తాం. ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను రకం, రంగుల వారీగా గ్రైండింగ్ మిషన్‌లో చిప్స్ మాదిరిగా ముక్కలు చేసి సంచుల్లో నింపుతాం. వీటిని హైదరాబాద్ కాటేదాన్‌లో రీసైక్లింగ్ చేసే కంపెనీలకు సరఫరా చేస్తున్నాం. దీంతో మాకు స్వయం ఉపాధి లభిస్తుంది. ఇతరులకు ఆదాయం లభిస్తుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఈ వ్యాపారంతోనే మా ముగ్గురు పిల్లలను ఇంజినీరింగ్, డిగ్రీ విద్య చదివిస్తున్నాం.



తాగి పడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలను యంత్రంతో ప్రెస్సింగ్ చేస్తున్న రాపోలు సైదులు, కవిత దంపతులు

చికెన్ ధరలు

ఫాంరేటు	109-00
రిటైల్	131-00
డ్రెస్డ్	190-00
స్కిన్‌లెస్	216-00

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

గుంత పూడ్చివేత

స్పందనకు వందనం



మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడు మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న ముఖం ద్వారా నుంచి లోపలికి వెళ్లే దారిలో మలుపు వద్ద మరమ్మతుల కోసమని తీసిన గుంత ప్రమాదకరంగా ఉంది. దీనిపై ఈనెల 10న 'ప్రమాదాన్ని పూడ్చండి' అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. మండల అభివృద్ధి అధికారిణి పూజ స్పందించి.. గుంతలో మట్టిని పోయించి పొక్లెయిన్‌తో చదును చేయించారు.

ఎల్‌వోసీ అందజేత

గట్టుప్పల: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.లక్ష సీఎం సహాయనిధి చెక్కును మండల కేంద్రానికి చెందిన మహేశ్వరం శైలజకు గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. మండల అధ్యక్షుడు జగన్నాథం, శంకరయ్య, యాదయ్య, మల్లేశం, అంజయ్య పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలో బీటీఎస్ శ్రీనివాసకాలనీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలి. **–అంజయ్య, నల్గొండ.**

✔ పందులు పెంపకం దారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. మరోసారి చెప్పి తదుపరి చర్యలు తీసుకుంటాం. **– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.**

ప్రతిభ విరిసి.. పల్లె మురిసి..

నకిరేకల్, న్యూస్‌టుడే: డీఎస్సీ-24 పోటీ పరీక్షలో ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ప్రతిభ చూపి ర్యాంకులు తెచ్చుకున్నారు. సర్కారు కొలువులు సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కొండం ప్రసన్న డీఎస్సీలో 22వ ర్యాంకు, నిమ్మల భవాని 41వ ర్యాంకు, అంతటి విమల 427వ ర్యాంకు, పగిళ్ల సైదులు 592వ ర్యాంకు, గంగుల సైదులు 44వ ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిమ్మల భవాని రెండు సర్కారు కొలువులకు ఎంపికయ్యారు. ఎస్జీటీతోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో జోన్-5లో 25వ ర్యాంకు సాధించారు. పగిళ్ల సైదులు మిల్లులో కార్మికునిగా పనిచేస్తూ కోచింగ్‌కూడా తీసుకోకుండా డీఎస్సీకి సిద్ధమయ్యారని, గంగుల సైదులు వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబ బాధ్యతలు మోస్తూ సర్కారు కొలువు సాధించారని గ్రామస్థులు వివరించారు. వీరిని ఎన్.జీ కళాశాల అధ్యాపకుడు టంగుటూరి సైదులు అభినందించారు.



కొండం ప్రసన్న



నిమ్మల భవాని



అంతటి విమల



పగిళ్ల సైదులు



గంగుల సైదులు

తెల్లబోతున్న పత్తి రైతు



బహిరంగ మార్కెట్లో పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

చండూరు, న్యూస్‌టుడే: పత్తికి సరైన ధర దక్కక రైతులు దిగాలు చెందుతున్నారు. ఏటా పెట్టుబడి భారం, సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో సరిగా వర్షాలు పడక.. కాలం కలిసి రాక దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. వచ్చిన ఆ కొద్ది పాటి పంటను తీసుకుందామంటే వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి తడిచి చేనులోనే మొలకలు వస్తున్నాయి. దీనికి తోడు కూలీల కొరత వెంటాడుతోంది. పత్తిని అమ్ముదామంటే ధర లేక పత్తి నిల్వలు ఇళ్లలోనే మగ్గుతున్నాయి. 20 రోజుల క్రితం క్వింటాల్ రూ.7 వేలు పలికిన పత్తి.. నేడు రూ.5500-6200 వరకు పలుకుతోంది. ప్రభుత్వం మద్దతు ధర గరిష్ఠంగా రూ.7521 కనిష్ఠంగా రూ.7151 ప్రకటించింది. మద్దతు ధరకు విక్రయిద్దామంటే జిల్లాలో ఎక్కడా కూడా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో తప్పని పరిస్థితిల్లో కూలీల ఖర్చులు, తెచ్చిన పెట్టుబడి తీర్చేందుకు రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం


–కత్తుల రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్

రైతులు బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు పత్తిని విక్రయించి మోసపోవద్దు. నాణ్యత కలిగిన, తేమ లేని పత్తిని ఇళ్లలో భద్రపరుచుకుని మద్దతు ధరను పొందాలి. సీసీఐ కొనుగోలు ప్రారంభించేందుకు ఇటీవల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కేంద్రాలు ప్రారంభించే వివరాలను అధికారులు త్వరలో ప్రకటిస్తారు.

నిల్వ చేయలేక ఇబ్బందులు పడుతున్నాం.

జక్కలి పరమేష్, బంగారిగడ్డ గ్రామం

నాకున్న ఎనిమిది ఎకరాలతో పాటు మరో ఎనిమిది ఎకరాలను రూ.10 వేల చొప్పున కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.5 లక్షలు ఖర్చు అయింది. దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. వచ్చిన పత్తిని అమ్ముదామంటే మార్కెట్‌లో ధర లేదు. దళారులు రూ.5500 అడుగుతున్నారు. ఇంట్లో నిల్వ చేద్దామంటే వర్షాల కారణంగా రంగు మారే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి సీసీఐ కొనుగోలు కేంద్రాలు చేయాలి.





నకిరేకల్: రతన్‌టాటా చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వ్యాపారులు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు

రతన్ టాటా మృతికి నివాళి

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు కందిమల్ల శిశుపాల్‌రెడ్డి, లింగస్వామి, రవిగౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్, సత్తయ్య, మత్స్యగిరి, రవి పాల్గొన్నారు.

నకిరేకల్: పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ సంస్థ గౌరవ అధ్యక్షుడు రతన్‌టాటా మృతిపట్ల వ్యాపారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. నకిరేకల్ ప్రధాన కూడలిలో గురువారం రాత్రి రతన్‌టాటా చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

తహసీల్దార్‌కు వినతి

చిట్యాల: పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ చిట్యాల తహసీల్దారు కృష్ణకు గురువారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నకిరేకల్: పుర ఛైర్‌పర్సన్ రజిత దంపతులను సన్మానిస్తున్న భవానినగర్ వాసులు

నకిరేకల్, న్యూస్‌టుడే: కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత చెప్పారు. స్థానిక మార్కెట్‌రోడ్డు భవానినగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి, అధ్యక్షుడు ఎం.భిక్షం, విశ్రాంత ఎంఈవో వీరమల్ల రవీందర్, ఎస్.వెంకట్‌రెడ్డి, ఎస్.భిక్షం, కె.భద్రారెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యవర్గంలో చోటు



నాంపల్లి, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలంలోని పస్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు **నక్క యుగేందర్** నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

శాలిగౌరారం, న్యూస్‌టుడే: మండలంలోని పెర్కకొండారానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శానాల యుగంధర్‌రెడ్డి తండ్రి శానాల అప్పారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మందుల సామేల్ పెర్కకొండారం వచ్చి అప్పారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలాధ్యక్షుడు కందాళ సమరంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, రంగారెడ్డి, దనుంజయ్య, భద్రయ్య, కిశోర్ పాల్గొన్నారు.



పెర్కకొండారంలో యుగంధర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సామేల్

భాజపా సభ్యత్వ నమోదు

నకిరేకల్, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న చెప్పారు. నకిరేకల్ పురపాలికలోని 221వ పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం మాట్లాడారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. పార్టీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి చినేని జానీ, మురళీమోహన్, సైదులు, నాగయ్య, ఎం.శ్రీనివాస్, కె.జా పాల్గొన్నారు.



నకిరేకల్: డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేస్తున్న మండల వెంకన్న

నకిరేకల్: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నెల్లిబండ గ్రామంలో ఆ పార్టీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య గురువారం ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి రాక

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం వస్తున్నారని కాంగ్రెస్ నాయకులు గురువారం తెలిపారు. నూతనంగా ఎన్నికైన పురపాలిక ఛైర్‌పర్సన్ చౌగోని రజిత ప్రమాణ స్వీకారోత్సవం, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్‌ల పంపిణీ సభలో ఆయన పాల్గొననున్నారు. మంత్రితో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొంటారని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో

నకిరేకల్: రామకృష్ణ- వేట్టయన్, **వెంకటేశ్వర-** దేవర

విజయరూపిణి.. అభయ ప్రదాయిని..



నాంపల్లి: నర్సింహులగూడెంలో కనకదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి మండపాలలో ప్రత్యేక పూజలు జరిపించారు. సామూహికంగా అమ్మవారికి అభిషేకం అర్చనలు, హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

చిట్యాల: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు మారగోని ఆంజనేయులు, సతీమణి మాధవితో పాటు పలువురు పాల్గొన్నారు.

కనగల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలో వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు దుర్గామాతగా దర్శనం ఇచ్చారు. దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కేతేపల్లి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం దుర్గామాత పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనిమిదో రోజు శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు ప్రత్యక్షమయ్యారు.



రాక్‌హిల్స్ కాలనీలో అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్



హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఆయన సతీమణి మాధవి



దుర్గాదేవిగా రేణుక ఎల్లమ్మ అమ్మవారు

పూల సింగిడి.. సద్దుల సందడి

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగను గురువారం జరుపుకున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి రంగురంగు పూలతో అలరించారు. మహిళలు బతుకమ్మలను ప్రత్యేక ఆకర్షణ వచ్చేలా అందంగా పేర్చుకొని తీసుకొచ్చారు. ఆటపాటలతో ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. –న్యూస్‌టుడే, యంత్రాంగం



నకిరేకల్: అయ్యప్పగుడి వద్ద బతుకమ్మలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



రామగిరి రామాలయంలో..




రామగిరి రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



హైదరాబాద్ రోడ్డులోని సాయి బాలాజీ కాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



నల్గొండ పట్టణం గ్రీన్‌సిటీ కాలనీలో



శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద సంబురాల్లో మహిళలు, చిన్నారులు



నల్గొండ: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రవీందర్‌నగర్‌లో సద్దుల బతుకమ్మలతో మహిళలు



సిలార్మియాగూడలో..

ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

కనగల్, న్యూస్‌టుడే: కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ గాదరి రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం గ్రామానికి చెందిన బైరగోని శంకర్ గుండెపోటుతో మృతి చెందాడని.. బంధువులు కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకురాలేదన్నారు. రాత్రి సమయంలో వైద్య సిబ్బంది ఉండరు అనుకొని జిల్లా కేంద్రానికి వెళ్లడం వల్ల ఆలస్యం జరిగిందన్నారు. పీహెచ్‌సీకి వస్తే సిబ్బంది సీపీఆర్ చేసే వారని ఆయన తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ ద్వారా వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు, అంకిత భావం, సామాజిక బాధ్యత, జాతీయభావాలు పెంపొందుతాయని 31వ ఎన్‌సీసీ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ టీఎం.లక్ష్మారెడ్డి తెలిపారు. నల్గొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ శిబిరంలో పదిరోజులుగా నేర్చుకున్న విషయాలు జీవితాంతం గుర్తుపెట్టుకుని విద్యార్థులు తాము కోరుకున్న భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. డ్రిల్, ఫైరింగ్, వ్యాసరచన, ఉపన్యాసం చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఎన్‌సీసీ కేడెట్లు దేశభక్తి పాటల నృత్యాలు ప్రదర్శించారు. లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు, సుబేదార్ మేజర్ ఎల్.మాధవరావు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు ఫణింద్ర, శీలంభద్రయ్య, ఈగల స్వరూపరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ వార్షిక శిబిరంలో విద్యార్థుల ప్రదర్శనలు

ఆవుల పట్టివేత

తిప్పర్తి, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 పశువులను తిప్పర్తిలో గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వాహనంలో పశువులను కబేళానికి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తిప్పర్తిలో పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం వాహనంలో 24 ఆవులు, 26 ఎద్దులు ఉన్నాయి. అనంతరం వాటిని మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లిలోని గోశాలకు తరలించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు రాజేందర్, శ్రీశైలం, అప్పారావు, శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిప్రశాంత్ తెలిపారు.

నేడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ప్రామాణిక విద్యను అందించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 11న నల్గొండ జిల్లాలోని నల్గొండ, మునుగోడు నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు సంబంధిత అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 11న ఉదయం 10గంటలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్గొండలోని గంధంవారిగూడెంలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్: గురుకుల వ్యవస్థకు శ్రీకారం చుట్టిన మునుగోడు నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలను తొలి విడతలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంజూరు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రకటించిన 20 గురుకులాల్లో నల్గొండ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాలున్నాయి. మునుగోడు నియోజకవర్గం పేరు లేకపోవడంతో ఆయన ప్రతిష్ఠాత్మకంగా భావించారు. ప్రభుత్వ పెద్దలతో సంప్రదించి తొలి విడతలోనే సాధించారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం గురుకుల విద్యాలయ భవన నిర్మాణానికి ఆయన చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. రూ.100 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం జరుగుతుందని, 2500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ గురుకులంలో ఉచితంగా ప్రభుత్వం విద్యను అందిస్తుందని తెలిపారు.

బొమ్మలరామారంలో కిడ్నాపర్, బాలుడి గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: ఒడిశాలో అపహరణకు గురైన బాలుడిని రాచకొండ పోలీసులు కాపాడారు. బాలుడు 12 రోజుల క్రితం అపహరణకు గురవ్వగా ఒడిశా పోలీసుల అభ్యర్థనతో రంగంలోకి దిగిన భువనగిరి ఎస్‌వోటీ బృందం 24 గంటల్లోనే కేసును చేధించింది. బాలుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలం తూముకుంట లోని ఇటుకబట్టీల్లో ఉన్నట్లు గుర్తించి రక్షించింది. చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళను, అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్టు చేసింది. రాచకొండ సీపీ సుధీర్ బాబు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

రోడ్డంతా గుంత.. ప్రమాదమే చెంత



మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి ప్రధాన కూడలికి వెళ్లే రహదారి భారీగా గుంతలు పడ్డాయి. వర్షం వచ్చిన ప్రతిసారి గుంతలు పడటంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గుంతలలో నీరు చేరి పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. గుంతలు పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, తిరుమలగిరి సాగర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని నాగార్జున నగర్‌లో వైష్ణవి అపార్ట్‌మెంట్ సమీపంలో పక్క కాల్వల్లో వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాం.
– కోటేశ్వరరావు, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు ఎక్కడున్నారో నిరక్షరాస్యులకు అర్థం కావటంలేదు.
– సుందరయ్య, దేవరకొండ

✔ ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. వచ్చిన రోగులు వారిని అడిగి వైద్యుల దగ్గరికి వెళ్లొచ్చు.
– డాక్టర్ మంగ్తనాయక్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

మిర్యాలగూడలో భారీ వర్షం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అరగంట పాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని రాజీవ్‌చౌక్, ఆర్టీసీ బస్టాండ్, విద్యుత్తు కార్యాలయం, చర్చి రహదారి, హనుమాన్‌పేట ప్రధాన రహదారిపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.



మిర్యాలగూడలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

చింతపల్లి, న్యూస్‌టుడే: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆలయ కమిటీ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ అన్నారు. ధనుంజయ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని సాయి దేవాలయంలో కేకు కోసి మాట్లాడారు. మానవ జీవితంలో ప్రతి ఒక్కరు దైవ చింతనతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వురె కృష్ణయ్య, గోశాల ఇంఛార్జి కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో కేకు కోసి మాట్లాడుతున్న ఆలయ కమిటీ ఛైర్మన్ ధనుంజయ

వారంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ఊరు కాని ఊరిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ.. చివరికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.
మిర్యాలగూడ పట్టణం, అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే:



లక్ష్యం పెట్టుకుని..
లక్షణంగా సాధించి

విధులు ముగించుకుని చదివే వాడిని

కోల సతీష్, బక్కయ్యగూడెం, నేరేడుచర్ల మండలం



డీఈడీ, ఎమ్మెస్సీ పూర్తి చేసి ఏడేళ్లుగా మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాను. సాయంత్రం ఆరు గంటల తర్వాత విధులు ముగించుకుని రాత్రి 12 గంటల వరకు చదివే వాడిని. ఖాళీ సమయాల్లో పట్టణంలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో తెలుగు అకాడమీ పుస్తకాలు చదివే వాడిని. ఎట్టకేలకు ఎస్జీటీగా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది.

తల్లి, భర్త ప్రోత్సాహంతో..

తుమ్మురుగోటి పావని, అడవిదేవులపల్లి



మా అమ్మ నర్సమ్మ వ్యవసాయ కూలీ. తాను జీవితంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని నన్ను చదివించింది. పది వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి.. అంబేడ్కర్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, నల్గొండ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను. 2018లో డీఎస్సీ రాయగా విఫలమయ్యాను.. తర్వాత సైదయ్యతో పెళ్లి అయ్యింది. అమ్మ, భర్త నన్ను బాగా ప్రోత్సహించారు. రెండేళ్లు కష్టపడి చదివి, ఆన్‌లైన్ క్లాస్‌లు విని పరీక్షలు రాయగా రెండో ప్రయత్నంలో జిల్లా స్థాయిలో ఎస్జీటీలో 86వ ర్యాంకు వచ్చింది.

పట్టుపట్టి.. విజయం సాధించి..

శ్రీనునాయక్, బంగారికుంటతండా



మా అమ్మ, నాన్నలు రుక్కి, రాంకోటి వ్యవసాయ కూలీలు. పదో తరగతి వరకు బంగారికుంట ప్రాథమిక పాఠశాల, అడవిదేవులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్, డిగ్రీ మిర్యాలగూడలో చదువుకున్నా. దేవరకొండలో డీఈడీ, నాగార్జునసాగర్‌లో బీఈడీ, ఓయూలో ఫిజిక్స్‌తో పీజీ పూర్తి చేశా. 2008, 2012, 2017 సంవత్సరాల్లో డీఎస్సీకి ప్రయత్నించగా.. కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయా. 2024లో నాల్గో ప్రయత్నంలో ఎస్జీటీలో ఎస్టీ కేటగిరీలో జిల్లా 15వ ర్యాంకుతో విజయం సాధించా.

చిన్న పిల్లలు ఉన్నప్పటికీ..

ధూపాటి కరుణ, మిర్యాలగూడ



ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే వివాహం జరిగింది. భర్త సతీష్, అమ్మ నాన్నలు వెంకటేశ్వర్లు, రమణల ప్రోత్సాహంతో డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాను. చిన్న పిల్లలు ఉన్నప్పటికీ రెండేళ్ల పాటు అకాడమీ పుస్తకాలు చదువుతూ స్వతహాగా సన్నద్ధమయ్యాను. దీంతో సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయిలో బీసీ-బీ విభాగంలో ప్రథమ స్థానం, మహిళల విభాగంలో మూడో స్థానం సాధించాను.

రోడ్డు బురదమయం.. ప్రయాణం నరకం



అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్య గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వైపు వెళ్లే సీసీ రోడ్డుపై మురుగు నిలిచి బురదమయంగా మారింది. ఈ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహనదారులు, స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి మోసిన్‌బిన్ అహ్మద్‌ను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.
– న్యూస్‌టుడే, అడవిదేవులపల్లి

నీరు వృథా.. తప్పని వ్యధ



మండల పరిధిలోని చిల్లాపురం గ్రామపంచాయతీ ఆరో వార్డులో వీధినల్లాల నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. దీంతో నీరందక కొందరు, రోడ్డుపై రాకపోకలు సాగించే స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వెంటనే నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మిర్యాలగూడ గ్రామీణం

అమ్మ దర్శనం.. భక్తజన పరవశం

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకుని అమ్మవారు శ్రీదుర్గాదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మిర్యాలగూడలోని పలు ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ సాయిదత్త ఆశ్రమంలోని శ్రీ అష్టలక్ష్మి మందిరంలో స్థల దాతలు పందిరి సత్యనారాయణ, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. వింజమూరులో మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
– న్యూస్‌టుడే, బృందం



మిర్యాలగూడ గాంధీనగర్‌లో..



అడవిదేవులపల్లిలో..



చింతపల్లి: వింజమూరులో ప్రత్యేక పూజలు చేస్తున్న మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు




చింతపల్లి: తక్కళ్లపల్లిలో హోమం చేస్తున్న భక్తులు



మిర్యాలగూడ: శ్రీ దుర్గాదేవి అవతారంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దంపతులు



డిండి: ఖానాపూర్‌లో...



చింతపల్లిలో..

వ్యర్థాలు తొలగించండి సారూ!



పట్టణంలోని నాగార్జుననగర్ వైష్ణవి అపార్ట్‌మెంటు వీధిలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగగా.. వ్యర్థాలు పేరుకుని దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. అటుగా నడిచి వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. పుర అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ యూసుఫ్ తెలిపారు.
– న్యూస్‌టుడే, మిర్యాలగూడ

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదినం



తన నివాసంలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

హాలియా, న్యూస్‌టుడే: హాలియాలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు భారాస శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం ఆయన తన నివాసంలో పార్టీ నాయకుల మధ్య కేకు కోసి పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించి, మొక్కను నాటారు.

త్రిపురారం: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో భారాస శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకు కోసి పంపిణీ చేశారు. జానయ్య, శ్రీనివాస్ రెడ్డి, చారి, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న దస్తగిరి, సైదులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ల్యాబొరెటరీలు, ఆసుపత్రులు, మందుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్యగౌడ్ మాట్లాడుతూ ఆసుపత్రులకు అనారోగ్య సమస్యలతో వెళ్తే అవసరం లేకున్నా వైద్య పరీక్షలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఫార్మాసిస్టులు లేకుండా ఆసుపత్రులలో మందుల దుకాణాలను నిర్వహిస్తున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఫరూక్, అంజయ్య, శంకర్, సంజీవ్, శరత్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

అడుగేస్తే ప్రమాదం..!



చిత్రంలో చూడండి. గుర్రంపోడు మండలం లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద రాతికల్వర్టు పైనుంచి దెబ్బతిని ఏర్పడిన రంధ్రం చూడొచ్చు. ఏమాత్రం తెలియకుండా రంధ్రంలో అడుగేస్తే ప్రాణాలేపోవచ్చు. పొంచిఉన్న ప్రమాదం గుర్తించకుండా వాహనాలు వేగంగా వస్తుంటాయని ప్రమాదాలకు గురవుతారని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.
– న్యూస్‌టుడే, గుర్రంపోడు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం

వేములపల్లి, న్యూస్‌టుడే: ట్రాలీ ఆటోను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన సారంగి సైదులు(40) పాత ఇనుము వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన ఆటోలో మిర్యాలగూడ వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో శెట్టిపాలెం గ్రామ శివారులోని అన్నపురెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద రోడ్డును దాటుతుండగా.. మిర్యాలగూడకు చెందిన కిరణ్ తన డ్రైవర్ రాఘవేంద్రతో కలిసి కారులో నల్గొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తూ అతివేగంగా వెనుక నుంచి బలంగా ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో వెళ్తున్న సైదులు ఎగిరి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడగా, కారు అదుపుతప్పి విభాగిని దాటి రోడ్డు అవతలి వైపు వెళ్లి కంటైనర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సైదులును స్థానికులు మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సైదులును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి భార్య సైదమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కారులో ప్రయాణిస్తున్న కిరణ్, రాఘవేంద్రలు స్వల్ప గాయాలతో బయటపడగా.. ప్రస్తుతం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



సారంగి సైదులు

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మాడ్గులపల్లి మండల పరిధిలోని కుక్కడం రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్గొండ రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కుక్కడం 105-7ఏ-8 మధ్య లూప్ లైన్ ట్రాక్‌పైన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు నల్గొండ రైల్వేస్టేషన్‌కు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు కింద పడి మరణించినట్లు గుర్తించారు. మృతుడి ఎడమచేతి మనికట్టుపై గతంలోనే పదునైన కత్తితో కోసుకున్నట్లు గుర్తులు ఉన్నాయని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి..

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మిర్యాలగూడలో చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్న సుమారు 65ఏళ్ల వయసున్న వృద్ధురాలు.. గత నెల 27న తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందడంతో ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని ఆచూకీ తెలిసిన వారు 87126 70150 నంబరుకు సంప్రదించాలని పోలీసులు సూచించారు.

సద్దుల బతుకమ్మా.. పోయిరావమ్మా

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో గురువారం సద్దుల బతుకమ్మ పండగను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. దేవరకొండ పురపాలిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ హాజరయ్యారు. గుర్రంపోడు మండలపరిషత్తు కార్యాలయం ఆవరణలో సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎంపీడీవో మంజుల, ఇతర సిబ్బంది స్వయంసహాయక గ్రూపులతో కలిసి బతుకమ్మలు తయారుచేసి ఆడిపాడారు.
– న్యూస్‌టుడే, బృందం



నాగార్జునసాగర్‌లో బతుకమ్మతో యువతి



మిర్యాలగూడ బోటింగ్ పార్కులో..



హాలియాలో..



దేవరకొండలో.. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

ఇసుక కుప్పలు.. ప్రమాద కారకాలు

హాలియా పురపాలిక మిర్యాలగూడ రోడ్డులో భవన నిర్మాణదారులు రోడ్డుపై ఇసుక, ఇటుక కుప్పలు పోయడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పుర సిబ్బంది వాటిని వెంటనే తొలగించాలని వాహనదారులు కోరారు. భవన నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ రామదుర్గా రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, హాలియా



అవీ.. ఇవీ

ప్రజా సమస్యలపై పోరాడండి.. మిర్యాలగూడ గ్రామీణం: అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తడకమళ్ల గ్రామానికి చెందిన కామ్రేడ్ గొర్ల ఇంద్రారెడ్డి మూడో వర్ధంతి కార్యక్రమానికి ఆయన గురువారం పాల్గొని నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర్లు, రవినాయక్, మంగారెడ్డి, సీతారాములు, గోవర్ధన, నగేష్, సైదమ్మ, గోవిందరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పరామర్శ.. మిర్యాలగూడ: పట్టణంలోని బాపూజీనగర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన భారాస నాయకుడు పండగ క్రాంతి తల్లి సోమలింగమ్మ పెద్దకర్మకు మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి గురువారం హాజరయ్యారు. సోమలింగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకన్న, శ్రీనివాస్, వినాయకరావు, లింగయ్య, గౌతమ్ కుమార్, మర్రెడ్డి, సత్యం, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన పాదూరి అహల్యమ్మ(85) వృద్ధాప్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సంజీవరెడ్డి, రవి, నగేష్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుని హక్కు.. పెద్దవూర: భారతదేశంలో ప్రతి వ్యక్తికి సమాచారం సేకరించే హక్కు ఉందని సామాజిక కార్యకర్త తగరం శ్రీను గురువారం పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి 19 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పెద్దవూర మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయంలో కేకు కోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005న ఏర్పడిందని దీని ద్వారా ప్రతి పౌరునికి సమాచారం తెలుసుకునే హక్కు ఉందని ఆయన అన్నారు.

అభినందన.. దేవరకొండ: దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన నేనావత్ చందర్ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై గురువారం మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దేవరకొండలోని ఆయన నివాసంలో విద్యార్థిని అభినందించారు. మాజీ వైస్‌ఎంపీపీ చింతపల్లి సుభాష్, విద్యార్థి తండ్రి భాను, రూప్ల, పరమేష్, వినోద్ తరుణ్ తదితరులున్నారు.

విద్యుత్ కోతలు.. దోమల మోతలు

దేవరకొండ, న్యూస్‌టుడే: 'దేవరకొండ డివిజన్‌లో విద్యుత్ కోతల సమస్యే లేదు. ఒకవేళ తలెత్తితే నిమిషాల్లో వాటిని సరిచేస్తాం' ఇటీవల ట్రాన్స్‌కో డీఈ వినియోగదారులతో అన్న మాటలివి. క్షేత్రస్థాయిలో విద్యుత్ కోతలు లేవంటూనే గంటల తరబడి సరఫరా నిలిచిపోతుంది. వేసవిని తలపిస్తున్న ఉక్కపోతలతో రాత్రివేళ ప్రజలు అల్లాడుతున్నారు. పైగా దోమలు విజృంభణతో వైరల్ జ్వరాలు వస్తున్నాయి. విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దేవరకొండ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

వెంటనే పరిష్కరిస్తున్నాం: జమీరుద్దీన్, ట్రాన్స్‌కో ఏఈ

ఇటీవల గణేశ్ నవరాత్రుల సందర్భంగా చెట్ల కొమ్మలు కొట్టేయడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేశాం. వాన వచ్చిన సమయంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MIRYALGUDA
I.A.No. 160 of 2022
in
O.S.No.131 of 2022
Between:
Pachva Srinivas ...Petitioner/Plaintiff
And
Vattepu Anasuryamma @ Anasurya and others ...Respendents/Defendants
To,
R-2 Vattepu Guruvaiah S/o late Sathaiah,
R-3 Vattepu Saidulu S/o Late Sathaiah,
Both are R/o. Wadapally Village, Damaracharla Mandal, Nalgonda Dist.
Whereas the plaintiff filed the above Petition for grant of Perpetual Injunction in the above suit against you and others and the same was posted to 25-10-2024 for your appearance, you are hereby summoned to appear either in person or through your pleader with your defence, if any at 10-30 A.M. on the above said dated before the Hon'ble court, failing which the suit will be heard and determined exparte.
(By order of the Hon'ble court)
Y.CHANDRA SEKHAR REDDY,
D. SATYANARAYANA,
P. ANJANEYULU
ADVOCATES,
H.I.G.-3, AP HB COLONY,
MIRYALGUDA, NALGONDA DIST.
94404 81223, 99853 42200
//COUNSEL FOR THE PLAINTIFF//